
సాక్షి బాపట్ల

మంగళవారం । 27 । మే । 2025



ప్రత్యేక పూజలు

మాచర్ల : శ్రీ గంగా పార్వతి నగరేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా అమావాస్య హోమం



చందోలు(కర్లపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో 76వ అమావాస్య హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి శరభ కాళేశ్వరి మహాదేవి అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

జూన్ 2న మాచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

మాచర్ల: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమాన్ని జూన్ 2న మాచర్ల పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వేణుబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న తురకా కిషోర్‌ను తొలగిస్తూ పురపాలక సంఘం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్ పదవి కూడా ఖాళీ అయింది. ఈనేపథ్యంలో ఈ రెండు పదవులకు సంబంధించి ఎన్నిక నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గురజాల ఆర్డీవో మురళి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. కౌన్సిల్ సభ్యులంతా తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై అధికారుల యోగాసనాలు



నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పెద్దచెరువు కలెక్టరేట్ బంగ్లా రోడ్డులో అధికారులు యోగాభ్యాసం చేశారు. యోగాపై ప్రజలకు అవగాహన నిమిత్తం నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జేవీ సంతోష్, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఇతర పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొని యోగా చేశారు.

సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్ 1100 ద్వారా నమోదు చేసుకోండి

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా సోమవారం నరసరావుపేట కలెక్టరేట్, ఆయా మండలాల్లో సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. దీనికి హాజరు కాలేనివారు టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదులు నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని తెలుసుకునేందుకు పై టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

వాహనాల దొంగలు అరెస్ట్



మంగళగిరి: మంగళగిరి రూరల్ పోలీసులు వివిధ వాహనాలను చోరీ చేసే నిందితులను అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ వై. శ్రీనివాసరావు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు, మోటారు వాహనాలను చోరీ చేస్తున్న కన్నా గోపి, ఎస్కే సర్దార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి టాటా ఏస్ వాహనం ఒకటి, 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల డీఎస్పీగా జగదీష్

గురజాల : గురజాల డీఎస్పీగా బి. జగదీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏప్రిల్ 10వ తేదీన గురజాల డీఎస్పీగా ఉన్న జగదీష్‌ను కొన్ని రాజకీయ కారణాలతో డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి గురజాల ఇన్‌చార్జి డీఎస్పీగా సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు వ్యవహరిస్తున్నారు. గురజాల డీఎస్పీ పరిధిలో గురజాల, మాచర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఇవి రెండు అత్యంత కీలకంగా ఉండటంతో తిరిగి జగదీష్‌ను డీఎస్పీగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అభయాంజనేయుడి హుండీ ఆదాయం రూ.10.80 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.10.80 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పితాని తారకేశ్వరరావు తెలిపారు. దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో సోమవారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ కుమార్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. గత 67 రోజులకు రూ. 10,80,452 వచ్చినట్లు వివరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్త మండలి సభ్యులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

కొంటారా...కొనరా?

- అమలు చేయనప్పుడు హామీలెందుకు?
- బ్లాక్ బర్లీ కొనిపిస్తామన్న మంత్రుల కమిటీ
- మూడు రోజులవుతున్నా పత్తాలేని పొగాకు కంపెనీలు
- జిల్లాలో 53,067 ఎకరాల్లో సాగు
- 9,02,139 క్వింటాళ్ల దిగుబడి అంచనా
- ఇప్పటికీ రైతుల వద్ద 7,22,139 క్వింటాళ్లు
- పొగాకు కంపెనీలపై ఒత్తిడి తీసుకురాని ప్రభుత్వం



తడిసిన పొగాకును ఆరబెడుతున్న రైతులు



వర్షానికి తడవకుండా పట్టలు కప్పిన రైతులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కష్టాల్లో కొట్టు మిట్టాడుతున్న బ్లాక్‌బర్లీ పొగాకు రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకును కొనిపిస్తామని శనివారం పర్చూరు నియోజకవర్గంలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించినా పొగాకు కంపెనీలపై ప్రభుత్వం ఆస్థాయిలో ఒత్తిడి తీసుకురావడం లేదని తెలుస్తోంది. దీంతో కంపెనీలు పొగాకు కొనుగోళ్లను సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ పరిస్థితిలో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరుసటి రోజు నుంచే పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలను ఆదేశించినట్లు మంత్రి చెప్పి మూడు రోజులవుతున్నా కంపెనీలు ఒక్క మట్ట పొగాకు కొనలేదు సరికదా, పత్తా లేకుండా పోయాయి. ప్రభుత్వం ఒత్తిడి పెంచకపోవడం వల్లే కంపెనీలు కొనుగోళ్లను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి రైతులకు పొగాకు కొంటామన్న భరోసా ఇచ్చి కంపెనీలు బ్లాక్ బర్లీ సాగు చేయించాయి. గత ప్రభుత్వంలో క్వింటాల్ పొగాకు రూ.14 నుంచి 18 వేలు ధర ఉండడంతో రైతులు విరివిగా సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చాక కొనలేమంటూ కంపెనీలు ముఖం చాటేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది.

80 శాతం పంట రైతుల వద్ద నిల్వ..

జిల్లాలో 53,067 ఎకరాల్లో బ్లాక్ బర్లీ సాగైతే ఒక్క పర్చూరు నియోజకవర్గంలోనే 52,989 ఎకరాల్లో వేశారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం ఎకరాకు సగటున 17 క్వింటాళ్లు అనుకుంటే 9,02,139 క్వింటాళ్ల దిగుబడి కాగా, పెట్టుబడికి తెచ్చిన అప్పులవాళ్ల ఒత్తిడి భరించలేక రైతులు 20 శాతం పొగాకు తక్కువ ధరకే తెగనమ్ముకోగా ఇంకా 80 శాతం (7,22,139 క్వింటాళ్లు) పొగాకు రైతులవద్దే ఉంది. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగడం, ఈనెల 28న ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలిలోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తుండడంతో దిగివచ్చిన కూటమి సర్కార్ పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలను ఆదేశించినట్లు ప్రకటించింది. నిజంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే స్వాగతించాల్సిందే. అయితే కంపెనీలతో రైతులవద్ద ఉన్న మొత్తం పొగాకును కొనిపిస్తారా? అందుకు కంపెనీలు అంగీకరిస్తున్నాయా? అన్నది అనుమానమే. వాస్తవానికి తాము రైతులవద్ద ఉన్న పొగాకును కొనలేమని, తమకున్న అవసరాలు, నిలువ సామర్థ్యాన్నిబట్టి కేవలం 20 వేల మిలియన్ కిలోల పొగాకును మాత్రమే కొంటామని జీపీఐతో పాటు ఐటీసీ కంపెనీ మంత్రుల బృందానికి తెలిపినట్లు సమాచారం. అంతకు మించి తమపై ఒత్తిడి పెట్టవద్దని సదరు కంపెనీలు వారిని కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రైతుల వద్ద సుమారు 73 వేల మిలియన్ కిలోల పొగాకు ఉన్నట్లు అంచనా. కంపెనీలు కేవలం 20 వేల మిలియన్ కిలోలు మాత్రమే కొంటే మిగిలింది ఎవరు కొంటారు అన్నది ప్రశ్నార్థకమే. కంపెనీలపై ప్రభుత్వం మెతక వైఖరితో వ్యవహరిస్తున్నట్లు ప్రచారం ఉంది.

పొగాకు కొనుగోళ్లలో పచ్చ పాతం

పొగాకు కొనుగోళ్ల వ్యవహారంలో అవకాశమున్న మేర పనిని చక్కబెట్టుకునేందుకు పర్చూరు నియోజకవర్గ పచ్చ బ్యాచ్ వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పర్చూరు ఎమ్మెల్యే అనుచరులు ఆ పార్టీకి చెందిన పొగాకు రైతుల జాబితాలను మాత్రమే సిద్ధం చేసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది. కంపెనీలు మొక్కుబడిగా కొనే పక్షంలో మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్యే ఇచ్చిన జాబితాకే అవకాశముంటుందన్నది వాస్తవం. ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరించకుండా కంపెనీలపై ఒత్తిడి తెచ్చి మొత్తం పొగాకు కొనుగోలు చేయించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతోపాటు రైతు సంఘాలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన

లక్ష్యాలను చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బ్యాంకులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద బాపట్ల జిల్లాలో 60 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని నిర్దేశించారని తెలిపారు. డిసెంబర్ నాటికి 47 వేల కనెక్షన్లు ఏర్పాటు చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. 2027 నాటికి మొత్తం లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి 3 కిలోవాట్స్ సోలార్ ప్లేట్లు అమర్చేందుకు నిర్ణయించడమైనదని తెలిపారు. ఈ పథకంకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టడం జరిగిందన్నారు. దరఖాస్తు దారులు రూ.20 వేలు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వచ్చిన తరువాత వాటిని తిరస్కరించకుండా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్స్‌కు సూచించారు. స్వయం సహాయక గ్రూపుల నుంచి లోన్ రికవరీ మొత్తం చెల్లించే బాధ్యత మాదేనని కలెక్టర్ బ్యాంకులకు భరోసా ఇచ్చారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, ఎల్‌డీఎం శివకృష్ణ, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ వేగంగా కొనుగోలు చేయాలి

బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్య ల పరిష్కారం కోసం పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పొగాకు కొనుగోలుపై ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగాకు కొనుగోలు తర్వాత పంట నిల్వ చేయడానికి అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. ధాన్యం సేకరణ వేగం పుంజుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

27నుంచి యోగాంధ్ర కార్యక్రమాలు

ఈనెల 27వ తేదీన బాపట్లలోని భావపురి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై జిల్లా స్థాయి యోగా కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లా అధికారులు, వారి సిబ్బంది మొత్తం హాజరు కావాలన్నారు. అదే మాదిరిగా ఈనెల 31వ తేదీన సూర్యలంక సమీపంలోని అటవీ శాఖ నగర వనంలో భారీ స్థాయిలో యోగాసనాల కార్యక్రమం జరపాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమంపై మాట్లాడారు. జూన్ 22వ తేదీ తర్వాత గ్రామీణ ప్రాంతాలలోని రహదారుల వెంట చెత్త కనిపించరాదన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుకు అండగా వైఎస్సార్ సీపీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పానెం చిన హనిమిరెడ్డి, పార్టీ నాయకులు, రైతులు

అద్దంకి: పొగాకు రైతుకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పొగాకు రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం పొదిలి వస్తున్నారని చెప్పారు. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలోని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం నల్ల బర్లీ సాగు చేసిన రైతు పరిస్థితి జీవన్మరణ స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు దిగుబడులు పడిపోవడం, మరో వైపు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. ఆదుకోవాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. అందుకే పొగాకు రైతుల తరపున పోరాటం చేసేందుకు, వారికి ధైర్యం కల్పించేందుకు జగన్ పొదిలి రానున్నట్లు చెప్పారు. అయితే టీడీపీ నాయకులు, అక్కడ హడావుడి చేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు. కానీ తమ నేత అనుకున్న కార్యక్రమం పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. చేతనైతే రైతులకు సాయం చేసే విధంగా ఉండాలే తప్ప వారికి మేలు జరిగే పనిని అడ్డుకోవాలనుకుంటే ప్రజలు బుద్ధి చెప్పి తీరుతారన్నారు. తమ పార్టీ తరపున ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణమూర్తి, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ పులికం కోటిరెడ్డి, ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ కోయి అంకారావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు జి.రఘురామగుప్తా, కొల్లా భువనేశ్వరి, మండల కన్వీనర్లు కృష్ణబాబు, నాగేశ్వరరావు, వివిధ మండలాల నాయకులు, కౌన్సిలర్లు, వివిధ హోదాల్లో ఉన్న మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే రేషన్ వాహనాలు రద్దు

- ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఎండీయూ వాహనదారుల ఆందోళన
- ఎండీయూ వాహనాలతో బాపట్లలో భారీ ర్యాలీ
- అడ్డుకునేందుకు పోలీసుల యత్నం
- ఎట్టకేలకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు



పోలీసులతో వాగ్వివాదానికి దిగిన సీఐటీయూ, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

బాపట్లటౌన్: రాజకీయ కుట్రతోనే కూటమి సర్కార్ పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే వాహనాలను రద్దుచేసిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా సోమవారం జిల్లాలోని ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లు, ఎండీయూ వాహనాలతో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. పోలీసులు అడ్డుకునే ప్రయత్నంచేసినప్పటికీ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ముందుకు సాగించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనికి వాహనాలను అనుమతించకపోవడంతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద వాహనాలను నిలుపుదల చేసి ఆపరేటర్లు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు సంఘీభావంగా సీఐటీయూ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం నిత్యావసర సరుకులను డోర్ డెలివరీ చేస్తే ప్రస్తుతం ప్రభుత్వం వాటిని నిలుపుదల చేయటం సమంజసం కాదన్నారు. వాహనాలను నిలుపుదల చేయటం వలన జిల్లాలో 18,520 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ విధానాన్ని కొనసాగించాలని, లోపాలు ఉంటే సరి చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకులు కే శరత్, ఎండీయూ వాహనాల జిల్లా నాయకులు ధార దేవసహాయం, గోపి, పేర్ని రమేష్, మేకల రాజేష్, రాఘవ పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధమవుతున్నాం



ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమవుతున్నాం. రేషన్ వాహనాలు తిప్పడానికి ఫిబ్రవరి 2027 వరకు గడువు ఉంది. అయినా ముందే ఆపేశారు. ప్రతి నెలా రూ.3 వేలు బ్యాంకుకు కిస్తీ చెల్లించాలి. వాహనం తీసుకునే సమయంలో రూ.68 వేలు అప్పు చేసి కట్టాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో వాహనం ఇచ్చారు. ప్రభుత్వం ఆ మొత్తం చెల్లించకపోతే తామే చెల్లించాలి. మా బాధలు అర్థం చేసుకోవాలి. –పులివర్తి రవీంద్రబాబు, యూనియన్ అధ్యక్షులు, భట్టిప్రోలు

మా పొట్టకొట్టడం సరికాదు



బడుగు, బలహీన వర్గాలకు చెందిన మేము ఎలాంటి ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం. ఆ సమయంలో గత ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంతో అప్పు చేసి మరీ వాహనాలను కొనుగోలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం మా ఉపాధిని దెబ్బతీసేలా నిర్ణయం చేయడం సరికాదు. దీంతో మా జీవితంలో మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. మాకు న్యాయం చేయాలి.

–పేర్ని రమేష్, యూనియన్ అధ్యక్షులు, వేటపాలెం మండలం

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పీజీఆర్‌ఎస్‌లో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ 177 అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలన చేశారు. మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. అర్జీల పరిష్కారంపై ప్రజల సంతృప్తిస్థాయి పెరిగేలా అధికారులు పనిచేయాలని చెప్పారు. అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. 22 క్యాటగిరీలో పెండింగ్‌లో ఉన్న 108 అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోలకు సూచించారు. సాధారణ బదిలీల్లో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయరాదన్నారు. ఆ స్థానంలో పొరుగు జిల్లాల నుంచి అదే హోదాలో వచ్చే వారు ఉంటేనే అనుమతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

నరసరావుపేట: వినియోగదారులకు మెరుగైన సేవలతోపాటు విద్యుత్ బకాయిలను వసూలు చేసి సంస్థ ప్రగతికి తోడ్పడాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డి కోరారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం పల్నాడు సర్కిల్‌ని సందర్శించారు. జొన్నలగడ్డలోని సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. పలు విషయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే విద్యుత్ జేఏసీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలు తీర్చాలని, నూతనంగా ఏర్పడిన సర్కిల్‌లో శాశ్వత ఉద్యోగులను నియమించాలని కోరారు. పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబట్లు, ఆర్ బంగారయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకు ఎఫ్‌ఓకు బెదిరింపులు

- బ్యాంకు లోను విషయమై ఇంటికి పిలిపించి బెదిరించిన నిందితులు
- అక్రమ కేసులు పెడతామంటూ ఇప్పటికే రూ.6.50 లక్షలు వసూలు
- ఐదుగురు నిందితుల అరెస్ట్?

చీరాల: బ్యాంకు లోను విషయమై వచ్చిన బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై అక్రమ కేసులు పెడతామని బెదిరించి రూ.6.50 లక్షలు వసూలు చేసిన ఘటనపై సోమవారం చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అందిన సమాచారం మేరకు... సారథి అనే వ్యక్తి చీరాల్లోని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకులో పర్సనల్ లోను నిమిత్తం ఓ మహిళ రాగా ఇంటిని పరిశీలించేందుకు ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటిలో ఉన్న వేరే మహిళతో లోను కోసం వచ్చిన మహిళ గురించి వివరాలను అడిగి తెలుసుకుంటున్నాడు. అప్పటికే ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అక్కడకు కొందరు వ్యక్తులు వచ్చి బెదిరింపులకు దిగారు. కత్తులతో బెదిరించి అతని వద్ద ఉన్న కొంత నగదు తీసుకుని మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించావని కేసులు పెడతామని బెదిరించారు. అయితే డబ్బులు కోసం నిందితులు తరచూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో సదరు బాధితుడు చీరాల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ కేసులో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే బాధితుడి వద్ద నుంచి రూ.6.50 లక్షలు విడతల వారీగా వసూలు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో తెలిపాడు. ఇంకా రూ. 10 లక్షలు కావాలని బెదిరిస్తుండటంతో పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 702

కొమ్ములు : 490 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,925	10,481

కాయలు : 212 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,875	10,300

మొత్తం అమ్మకాలు : 526.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

విద్యాశాఖ బదిలీలలు

- శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారిపై కనీస మానవత్వం కరవు
- 25 ఏళ్లుగా అమలులో ఉన్న ప్రిఫరెన్షియల్ కేటగిరీపై ఆంక్షలు
- ఉపాధ్యాయ బదిలీలకు నేటితో ముగియనున్న గడువు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాఖలైన దరఖాస్తులు 6,870
- లాంగ్ స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు, టీచర్లు 4,143 మంది

బదిలీలకు అవకాశం.. కఠిన నిబంధనలతో మెకాలొడ్డి..



ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలకు తెరలేచిందనే ఆనందం ఉపాధ్యాయుల్లో ఎక్కువ కాలం నిలిచేలా లేదు. ఎందుకంటే బదిలీకి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలతో కోరుకున్న పాఠశాలకు వెళ్లడం గగనమవుతోంది. ఒకవైపు బదిలీలు చేపడుతున్నామంటూనే మరోవైపు గతంలో ఎన్నడూ లేని రీతిలో విధించిన నిబంధనలతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మంగళవారం ముగియనుంది. ఇందుకు సంబంధించి జీఓ 22 ద్వారా విడుదల చేసిన మార్గదర్శకాలతో ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారు. పుట్టుకతో శారీరక వైకల్యానికి గురైన ఉపాధ్యాయులకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ ద్వారా వారు కోరుకున్న పాఠశాలకు వెళ్లే సదుపాయంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. శారీరక వైకల్యం 70శాతం లోపు ఉంటే ప్రాధాన్యత క్రమంలో పాయింట్లు, 70 శాతానికి పైగా ఉంటే ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సంబంధిత ఉపాధ్యాయులు వారు పనిచేస్తున్న పాఠశాలలకు బదిలీపై వెళ్లవచ్చు. గత 25 ఏళ్లకు పైగా అమల్లో ఉన్న ఈ విధానాన్ని మార్చివేసి ఎస్జీటీలకు 40 శాతం, స్కూల్ అసిస్టెంట్లకు 50 శాతం సీలింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

కక్షపూరితంగానే..!

శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారిపై కనీస మానవత్వం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బదిలీల ప్రక్రియలో భాగంగా ఒకే పాఠశాలలు ఐదు విద్యాసంవత్సరాలు పూర్తి చేసుకున్న గ్రేడ్-2 హెచ్‌ఎం, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి.

- ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఒకరు లేక ఇద్దరు ఎస్జీటీలు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు లాంగ్ స్టాండింగ్ విధానంలో బదిలీపై వెళ్లేందుకు పీహెచ్ కేటగిరీ ఉపాధ్యాయులకు అవకాశం లేదు. ముగ్గురి కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఉంటేనే సదరు పాఠశాలలను కోరుకోవాలని లేకుంటే మరో పాఠశాలకు వెళ్లాలంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం, సీలింగ్ పరిధికి మించిన పాఠశాలలను బ్లాక్ చేసింది.
- పుట్టుకతో అంధత్వం, వినికిడి లోపంతో పాటు నడవలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయులకు గతంలో తాము పని చేస్తున్న పాఠశాలల్లోనే బదిలీ కాకుండా ఉండటంతో పాటు కోరుకున్న చోటకు బదిలీపై వెళ్లే అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం ఈ సదుపాయం లేకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ప్రభుత్వం కొత్త భాష్యం చెబుతోంది.
- శారీరక వైకల్యంతోపాటు దీర్ఘకాలిక జబ్బులు, కేన్సర్, గుండె జబ్బులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు హైస్కూళ్లలో సింగిల్ సబ్జెక్టు టీచర్లుగా బదిలీపై వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు. అంధ, వినికిడి లోపం, నడవలేని స్థితిలో ఉన్నవారికి సైతం కోరుకున్న పాఠశాలలకు వెళ్లే అవకాశం లేకుండా కఠిన నిబంధనలు విధించారు. ప్రతి మండలంలో 15 వరకు ఖాళీలు ఉండగా, వాటిలో కేవలం ఐదు స్థానాలు మాత్రమే కోరుకునే విధంగా ఉంచి, మిగిలిన వాటిని బ్లాక్ చేశారు.
- దూరప్రాంతాల్లో మగ్గుతూ వైద్య సదుపాయాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాలని ఆశపడుతున్న టీచర్లకు మొండిచెయ్యి చూపారు. భర్త చనిపోయిన మహిళా ఉపాధ్యాయులకు విడాకులు తీసుకున్న ఉపాధ్యాయినులకు సైతం నిరాశే ఎదురవుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలు ఉన్న ఉపాధ్యాయులకు సైతం అన్యాయానికి గురవుతున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

ఆర్థికంగా భారం లేని బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం ఎందుకింత కఠినంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘాలతో జరిపిన చర్చలకు, మార్గదర్శకాలకు పొంతన లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 6,870 దరఖాస్తులు

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ముగియనుండగా, సోమవారం నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6,870 మంది ఉపాధ్యాయులకు బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరిలో లాంగ్ స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు, టీచర్లు 4,143 మంది ఉన్నారు.

వైకల్యంతో పుట్టడం మా తప్పా ?



నేను గుంటూరు రూరల్ ఓబులనాయుడుపాలెంలోని ఎంపీయూపీఎస్‌లో పని చేస్తున్నాను. 70 శాతానికి పైగా శారీరక వైకల్యానికి గురైన నేను బదిలీల్లో గుంటూరుకు సమీపంలోని పాఠశాలలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు. ఉపాధ్యాయ బదిలీల చట్టంలో లేని విధంగా జీఓలో అనేక కఠిన నిబంధనలు విధించారు. శారీరక వైకల్యంతో జన్మించడం నా తప్పిదమా ? మానవత్వాన్ని చూపాల్సిన ప్రభుత్వం, అధికారులు ఈ విధంగా నిబంధలు విధించి పీహెచ్ కేటగిరీ ఉపాధ్యాయులకు అన్యాయం చేయడం తగదు.

– పి.నాగశివన్నారాయణ, ఎస్జీటీ, గుంటూరు

మానవత్వం లేకుండా మార్గదర్శకాలు



బదిలీల మార్గదర్శకాల్లో విద్యాశాఖాధికారులు ఇష్టారాజ్యంగా నిబంధనలు విధించారు. పీహెచ్ కేటగిరీతోపాటు ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేస్తూ పాఠశాలల్లో ఖాళీలను బ్లాక్ చేశారు. శారీరక వైకల్యానికి గురైన ఉపాధ్యాయుల కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీడబ్ల్యూడీ చట్టానికి వ్యతిరేకంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. వైకల్యాన్ని అధిగమించి, ఎంతో కష్టపడి చదువుకుని ఉద్యోగం పొందిన వారిపై మానవత్వంతో వ్యవహరించాల్సినదిపోయి ఈ విధంగా కఠిన నిబంధనలు విధించడం దుర్మార్గం. – కె.బసవలింగారావు, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

బహిర్భూమికి వెళ్లి ప్రాణాలు వదిలాడు



జొన్నలగడ్డ మోహన్ కుమార్ (ఫైల్)

పర్చూరు(చినగంజాం): బహిర్భూమికి వెళ్లి వాగులో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన సోమవారం పర్చూరు గ్రామంలోని ఇందిరా కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. జొన్నలగడ్డ మోహన్‌కుమార్(24) సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై బహిర్భూమికి వెళ్లాడు. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో ప్రమాదవశాత్తూ జారిపడి వాగులో మునిగిపోయాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. బహిర్భూమికి వెళ్లిన తన కుమారుడు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తండ్రి నాగరాజు అతని స్నేహితులను ఆరా తీశారు. అతడు తీసుకెళ్లిన ద్విచక్రవాహనం వాగు వద్ద ఉందని తెలియడంతో అక్కడికి వెళ్లి పరిసర ప్రాంతాలను గమనించినప్పటికీ కుమారుని జాడ కన్పించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పర్చూరు ఎస్‌ఐ మాల్యాద్రి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి వాగులో మునిగి ఉంటాడనే అనుమానంతో చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వెతికించాడు. ఏడీఎఫ్‌ఓ రామకృష్ణ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, షేక్ షారూఖ్, వెంకట శివాజీ, శ్రీను.. వాగులో నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని చూసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు, కాలనీ వాసులు ఒక్కసారిగా బోరున విలపించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దృష్టి సారించారు. చీరాల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న జొన్నలగడ్డ నాగరాజుకు ఇద్దరు కుమారులు కాగా మోహన్‌కుమార్ పెద్ద కుమారుడు. డిగ్రీ చదువుకున్న అతనికి ఇంకా వివాహం కాలేదు.

క్లుప్తంగా

డీఈఓ సైట్‌లో హెచ్‌ఎం పోస్టుల సీనియార్టీ జాబితా

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, నగరపాలకసంస్థ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ, హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను deognt. blogspot. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, అటెస్టేషన్ చేయించిన రెండు సెట్ల కాపీలు, సేవా పుస్తకంతో మంగళవారం ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జిల్లా పరీక్షా భవన్‌లో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ప్రైమరీ హెచ్‌ఎం సీనియార్టీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలనిసూచించారు.

నేడు గ్రేడ్–2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల ధ్రువపత్రాల పరిశీలన

గుంటూరు జోన్–3 పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం 9 గంటలకు గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

గుంటూరు మెడికల్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సూచించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లతో కీటక జనిత వ్యాధుల నివారణపై సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా మెజర్స్ అమలు చేయాలన్నారు. అడల్ట్ మస్కిటో మెజర్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ, మలేరియా వంటి దోమ కాటు వ్యాధులను గణనీయంగా తగ్గించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వల్ల దోమలు దరిచేరవని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, ఏఎంఓ ప్రభాకర్‌రెడ్డి, ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర బాబు, ప్రశాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్లు శేషగిరిరాజు, శ్రీమన్నారాయణ, శిగణేష్ పాల్గొన్నారు.

ముస్లింల చైతన్యానికి రాజకీయ వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లాల ఎంయూఎఫ్ ముఖ్యనేతల నిర్ణయం



తెనాలి సమావేశంలో ఎంయూఎఫ్ నేతలు

తెనాలి: ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ (ఎంయూఎఫ్)ను బలోపేతం చేసుకుంటూ అనుబంధంగా రాజకీయ చైతన్య వేదికను ఏర్పాటు చేయాలని ఎంయూఎఫ్ ముఖ్యనేతల సమావేశం తీర్మానించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంయూఎఫ్ ముఖ్యనేతల సమావేశం ఆదివారం స్థానిక చినరావూరులోని సీనియర్ నేత షేక్ ఖలీల్ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుత రోజుల్లో ఎంయూఎఫ్ ఆవశ్యకత అనే అంశంపై జరిగిన సమావేశానికి ఆ సంస్థ అధ్యక్షుడు ఎండీ కలీం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ గత 28 ఏళ్లుగా పార్లమెంట్ వ్యవస్థను విశ్వసిస్తూ, ప్రజాస్వామ్య లౌకికవాద విధానాలను అవలంబిస్తూ, ఎన్నో కార్యక్రమాలతో ముస్లింల న్యాయమైన హక్కులను సాధించేందుకు కృషిచేసినట్టు గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన షేక్ ఖలీల్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంయూఎఫ్‌ను గుంటూరు ఉమ్మడిజిల్లాలో బలోపేతం చేసేందుకు 17 నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు ముఖ్యనేతలంతా కృషిచేయాలని కోరారు. ముస్లింలను రాజకీయంగా చైతన్యపరచాల్సిన అవసరం ఉన్నందున ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌కు అనుబంధంగా రాజకీయ చైతన్య వేదిక ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సమావేశంలో ప్రవేశపెట్టారు.

సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించటంతో తీర్మానం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య నాయకులు పర్యటించి నియోజకవర్గస్థాయి సమావేశాల నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా ముఖ్య నాయకులు షేక్ కరీముల్లా (ప్రత్తిపాడు), ఎంఏ సాలార్ (వినుకొండ), షేక్ ఇబ్రహీం (పెదకూరపాడు), మెమన్ బాష, సయ్యద్ జాఫర్ (పొన్నూరు), సయ్యద్ జాకీర్ హుస్సేన్ (తాడికొండ), సయ్యద్ ఆదమ్ సాహెబ్ (గుంటూరు వెస్ట్), సయ్యద్ గౌస్ బాషా, షేక్ వహీద్ (గుంటూరు ఈస్ట్)తోపాటు తెనాలి నియోజవర్గంలోని మండలాల నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతుల నిరసన దీక్ష

చిలకలూరిపేట: నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని మంగళవారం ఉదయం 10 గంటలకు ఐటీసీ కంపెనీ వద్ద రైతుల నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సమక్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా కొనుగోళ్లు చేయకపోవడంతో ఈ దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు. క్వింటా ఒక్కింటికి గత ఏడాది కొన్న రూ.15 వేలకు తక్కువ కాకుండా బర్లీ పొగాకు కంపెనీల చేత ప్రభుత్వం కొనిపించాలన్నారు. పొగాకు కంపెనీలు న్యాయమైన ధరకు కొనుగోలు చేయకపోతే మార్కెఫెడ్ ద్వారా కొని రైతులను ఆదుకోవాలన్నారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం పొగాకు కంపెనీలకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న ఐటీసీ కంపెనీ ముందు నిర్వహిస్తున్న నిరసన దీక్షల్లో రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించండి

- చీరాల డీఎస్పీ మొయిన్
- అర్జీలు స్వీకరణ



డీఎస్పీ ఎం.డి.మొయిన్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను చీరాల డీఎస్పీ మొయిన్‌కు వివరించారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ సీఐలు, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

నరకం అనుభవిస్తున్నా..



నాకు ఐదేళ్ల కిందట గ్రామానికి చెందిన అక్కల మణికంఠరెడ్డితో వివాహం జరిగింది. నాకు ముగ్గురు ఆడపిల్లలు. నా భర్త ఏడాది కిందట చనిపోయాడు. అప్పటి నుంచి అత్త నాంచారమ్మ, మామ శివసుందర్‌రెడ్డిలు నన్ను ఇంటి నుంచి పంపించారు. నేను ప్రస్తుతం నా పుట్టింట్లోనే ఉంటున్నా. ముగ్గురు ఆడపిల్లలను పెట్టుకొని నరకం అనుభవిస్తున్నా. కనీసం నన్ను అత్త, మామలు పట్టించుకోవడం లేదు. ఇదేమని అడిగితే నీతో, నీ పిల్లలతో మాకు సంబంధం లేదని చెబుతున్నారు. పిల్లల భవిష్యత్తు ఊహించుకుంటేనే భయమేస్తుంది.

–అక్కల కుసుమకుమారి, కొత్తపాలెం, చీరాల మండలం

కొడుకు, కోడలు చంపాలని చూస్తున్నారు..



నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఆరేళ్ల కిందట నా దగ్గరున్న రూ.5 లక్షల నగదు నా పెద్దకుమారుడు నాగేశ్వరరావు తీసుకున్నారు. వాటిని తిరిగి ఇవ్వమని అడిగినందుకుగాను నా కొడుకు, కోడలు లక్ష్మీప్రసన్నలు నన్ను చంపాలని చూస్తున్నారు. వారు ఏ క్షణంలో ఏం చేస్తారోనని భయంగా ఉంది. నా కుమార్తె బంగారం కూడా బలవంతంగా తీసుకొని మమ్మలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

–కరేటి పద్మ, యడవూరు, వేమూరు మండలం

చీటీల పేరుతో మోసం



చీరాల పట్టణంలోని గట్టి తిరుపతిరావు చీటీల పాటలు వేశారు. అతని దగ్గర నేను పాటలు కట్టాను. నాకు రూ.6 లక్షలు ఇవ్వాల్సి ఉంది. పాటలు అయిన తర్వాత కూడా డబ్బులు నాకు ఇవ్వలేదు. ఇదేమని అడిగితే నీకు దిక్కున్నచోట చెప్పుకో అని నన్ను బెదిరిస్తున్నారు. 2022 నుంచి నేను అతని చుట్టూ తిరుగుతూనే ఉన్నాను.

– తమ్మిశెట్టి రాము, అవ్వారువారి వీధి, చీరాల

లంచం డిమాండ్ చేస్తున్నారు..



నేను 1985లో ఏకేపీఅండ్‌పీకే జూనియర్ కళాశాలలో అటెండర్‌గా విధుల్లో చేరాను. 2025 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేశాను. పెన్షన్ పేపర్లపై సంతకం చేయడానికి మా కళాశాల ప్రిన్సిపాల్ చేపూరి బాబు రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇదేమని అడిగితే లంచం ఇస్తేనే సంతకం పెడతాను. లేకుంటే నేను పెట్టను. అంటూ బెదిరిస్తున్నారు.

– రావుల నాగరాజు, కొత్తపేట, చీరాల

వ్యక్తి అనుమానాస్పద మృతి



క్రోసూరు: మండలంలోని విప్పర్ల, ఊటుకూరు గ్రామాల ప్రధాన రహదారిపై ఒంటిపై తీవ్ర గాయాలపై వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడం కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, క్రోసూరు ఎస్‌ఐ పి.రవిబాబులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు జరిపారు. మృతుడు క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన కుంభా సాంబశివరావు(35)గా గుర్తించారు. తన ద్విచక్ర వాహనం పక్కన ఒంటిపై తీవ్ర గాయాలతో చొక్కా లేకుండా పడి ఉండటాన్ని గమనించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం, డ్వాగ్ స్క్వాడ్‌ను తెప్పించారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు చెందిన వాడు. క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన అనంతమ్మను వివాహం చేసుకుని సుమారు 10 సంవత్సరాల నుంచి అనంతవరంలోనే ఉంటున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

'సాతి'పై అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఆర్.శరత్‌కుమార్

గుంటూరు లీగల్: హైకోర్ట్ ఆదేశాల మేరకు నాల్గో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్టేక్ హోల్డర్స్‌కు సాతి (సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సిస్ త్రూ ట్రాకింగ్, హోలిస్టిక్ ఇంక్లూషన్)పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పాల్గొని సాతి డిస్ట్రిక్ట్ కమిటీ విధి, విధానాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఆధార్ నమోదు, న్యాయ సహాయం, సంక్షేమ పథకాలతో అనుసంధానం ద్వారా అనాథ పిల్లలను గుర్తించి, వారికి సహాయం చేయడానికి సాతి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ ఒక్క బిడ్డ గుర్తింపు లేకుండా, వారి హక్కులు, అర్హతలకు దూరంగా ఉండకుండా చూసుకోవడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. వీధి బాలలు, అనాథలు, రక్షించబడిన పిల్లలు వంటి 18 సంవత్సరాల లోపు నిరాశ్రయులైన పిల్లలందరికీ చట్టపరమైన గుర్తింపును అందించడం, వారికి ప్రభుత్వ పథకాలు, విద్య, ఆరోగ్యం, రక్షణ సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కమిటీలో సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్ పర్సన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి యూఐడీఏఐ ప్రతినిధి, ప్రతి తాలూకా తహసీల్దార్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఆరోగ్య అధికారి, సివిల్ సర్జన్, జిల్లా శిశు అభివృద్ధిశాఖ అధికారి, జువెనైల్ యూనిట్ నుంచి పోలీస్ అధికారి, అనాథ శరణాలయాలు, బాలల సంరక్షణ సంస్థల ప్రతినిధులు ఐదుగురు, ప్యానల్ లాయర్లు నలుగురు, పారా లీగల్ వలంటీర్లు నలుగురు సభ్యులుగా ఉంటారన్నారు.